సాక్షి మంచిర్యాల

గురువారం • 21 • ఆగస్టు • 2025



ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

జిల్లాలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటానికి నివాళులు అర్పించారు. 9లో▸

మట్టి మేలు తలపెట్టి..!

- వినాయక ప్రతిమల తయారీ
- పర్యావరణహితంగా గణనాథులు



పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు వినాయకుడు. రంగులు, రసాయనాలతో తయారైన గణేష్ ప్రతిమలు నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతోంది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పలువురు కళాకారులు మట్టి మేలు తలపెట్టి పర్యావరణహితంగా మట్టి వినాయకులు తయారు చేస్తున్నారు. మట్టి ప్రతిమల తయారీ కళాకారులపై ప్రత్యేక కథనం.

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

నేరం జరిగిన చోటే ఫోరెన్సిక్ పరీక్షలు

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



వాహనాన్ని ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: నేరం జరిగిన చోటే ఫోరెన్సిక్ (ఎఫ్‌సీఎల్) పరీక్షలు నిర్వహిస్తామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. నేర పరిశోధనలో భాగంగా రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ ఫోరెన్సిక్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. రామగుండం కమిషనరేట్‌కు కేటాయించిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అత్యాధునిక పరికరాలతో మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ వాహనంలో చేరుకుని రక్తపు మరకలు, వేలిముద్రలు, ఇతర సాక్ష్యాధారాలు సేకరించి సంబంధిత దర్యాప్తు అధికారికి అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏవో శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌ఎఫ్ఎస్ఎల్ మంచిర్యాల, ఏ.రాము, ఇన్‌స్పెక్టర్‌లు రవీందర్, చంద్రశేఖర్‌గౌడ్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం, ఆర్ఎస్సై ప్రవీణ్‌కుమార్, సీసీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ, ఐటీఐ శిక్షణతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న సుధాకర్‌కుమార్

మంచిర్యాలఅర్బన్: ఐటీఐ, ఏటీసీలో శిక్షణ పొందితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరితగతిన పొందవచ్చని రిటైర్డు ఐఏఎస్ అధికారి పి.సుధాకర్‌కుమార్ అన్నారు. బుధవారం మంచిర్యాల ఐటీఐలో విద్యార్థులు, సిబ్బందితో సంభాషణాత్మక సమావేశం నిర్వహించారు. మధ్య, చిన్న తరహా పరిశ్రమల్లో అత్యాధునిక యంత్రాలు ఉపయోగిస్తున్నారని, తగిన ప్రావీణ్యత కలిగిన వ్యక్తులు ఏటీసీల ద్వారా తయారవుతారని అన్నారు. ఐటీఐ ఫ్యాకల్టీ, టాటా టెక్నాలజీ శిక్షకులు విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని సూచించారు. ఐటీఐ ఆవరణలోని ఏటీసీ భవనం, అత్యాధునిక పరికరాలు పరిశీలించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్, ట్రెనింగ్ ఆఫీసర్ శ్రీధర్ రాజు, ఎంఏ ఆఫీ, డిప్యూటీ ట్రెనింగ్ ఆఫీసర్ సోహెబ్, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల జాతర

పాతమంచిర్యాల: జిల్లాలో ఈ నెల 22న ఉపాధి హామీ పనుల జాతర నిర్వహించనున్నారు. నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణాలు, పొలంబాట పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళల కోసం పశువుల కొట్టాలు, కోళ్ల, గొర్రెల షెడ్లు, వ్యవసాయ బావులు, వానపాముల ఎరువుల తయారీ, అజోల పిట్‌ల నిర్మాణాలు ప్రారంభం, పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లాలోని 306 గ్రామాల్లో ఒకే రోజు రూ.10,34,26,555 వ్యయంతో 1664 పనులు చేపడుతారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

'స్థానిక సంస్థల్లో బీజేపీదే గెలుపు'



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. రఘునాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని అన్నారు. నాయకులు కొయ్యల ఏమాజీ, అరుముల్ల పోషం, దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, బియ్యాల సతీశ్‌రావు, ఎనదంగుల కృష్ణమూర్తి, పులగం తిరుపతి, రమణరావు పాల్గొన్నారు.

మంచిర్యాలను మరిచారా..!



నెన్నెలలో ఇటీవల వరదతో కోతకు గురై, ఇసుక మేటలు వేసిన పత్తి పంట(ఫైల్)

- జిల్లా వైపు చూడని ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి'
- ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల పూర్తయిన సమీక్షలు
- అధికార పార్టీ ఎమ్మెల్యేలున్న జిల్లాలోనే భిన్న పరిస్థితి
- వర్షాలు, వరదలు, తాజా పరిస్థితిపై సమీక్ష కరువు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంచిర్యాల జిల్లా పర్యటనకు ముహూర్తం ఖరారు కావడం లేదు. గత రెండ్రోజులుగా ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించారు. కానీ మంచిర్యాల జిల్లా షెడ్యూల్ ఖరారు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆయా జిల్లాల్లో పంటల నష్టంపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోనూ వానాకాల సీజన్, వర్షాలు, వరదలతోపాటు ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించాల్సి ఉన్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇన్‌చార్జి మంత్రి జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో అవసరమైన చోట్ల నిధుల మంజూరు, ఆ మేరకు అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో పరిశీలనకు అవకాశం కలుగుతుంది. అంతేగాక ప్రభుత్వ పాలనపై జిల్లా ప్రజలకు భరోసా కల్పించే వీలవుతుంది.

ఎవరికి వారే..

జిల్లాలో ప్రధాన నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌తోపాటు ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని జన్నారం మండలం ఉంది. స్థానిక ఎమ్మెల్యేలతో ఇన్‌చార్జి మంత్రి అభివృద్ధి పథకాల అమలు, సమస్యలు, ప్రజల ఇబ్బందులు, ఇతరత్రా నివేదికలు జిల్లా అధికారుల నుంచి తీసుకుని సమీక్షించాల్సి ఉంది. ఈ క్రమంలో పాలనలో లోపాలు ఉంటే సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. 'జూపల్లి' జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పర్యటించలేదు. మరోవైపు జిల్లా పరిధిలోనే చెన్నూర్ ఎమ్మెల్యే, కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సైతం తన నియోజకవర్గానికే పరిమితం అయ్యారు. గత కొద్ది రోజులుగా మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్ వారానికోసారి నియోజకవర్గానికి వస్తూ వెళ్తున్నారు. ఎక్కువగా హైదరాబాద్ కేంద్రంగానే పాలన సాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ఖానాపూర్ పరిధిలోని జన్నారం మండలంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పర్యటిస్తున్నారు.

రాజకీయ వైరం, సఖ్యత లేక

మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్, 'గడ్డం' సోదరులకు సఖ్యత లేకపోవడంతోనూ సమస్యలు ఉన్నాయి. గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమీక్ష సమావేశంలోనూ ముగ్గురు ఎమ్మెల్యేలు హాజరైన సందర్భాలు లేవు. దీంతో అధికార పార్టీలోనే ఎమ్మెల్యేలు కలిసికట్టుగా లేరు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలో పంటలు నీట మునుగడం, యూరియా సరఫరా, పంటల నష్టం అంచనాలు, తాగునీటి సరఫరా, పట్టణాల్లో పలు కాలనీల్లోని ఇళ్లకు నీరు చేరడం, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు అస్వస్థత, గోదావరి తీర ప్రాంతాలకు అప్రమత్తత, విద్య, వైద్యం, ఆరోగ్య అంశాలతోపాటు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సరఫరా, సాగునీరు, తదితర ఇతర సంక్షేమ పథకాలు అమలు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, బిల్లుల విడుదల, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల సమక్షంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష చేయాల్సి ఉంటుంది. ఇటీవల రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అధికార పార్టీ నాయకులతోపాటు ప్రజలు, అధికార యంత్రాంగం సైతం సమీక్ష ఉంటుందా? లేదా?అని చర్చించుకుంటున్నారు.

'ఎల్లంపల్లి'కి భారీగా వరద



ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేతతో గోదావరి నదిలోకి చేరుతున్న వరదనీరు



దేవులవాడలో నీటమునిగిన పత్తి పంట

- ప్రాజెక్టు గేట్లు 40 ఎత్తివేత
- 5.30లక్షల క్యూసెక్కులు నీరు విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది. గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తుండడంతో నీరు పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాలతోపాటు కడెం, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేస్తూ గోదావరికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను 14.800 టీఎంసీల నీరు ఉంది. ఎస్సారెస్పీ నుంచి 1.05లక్షల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 2.18లక్షల క్యూసెక్కులు మొత్తంగా 3.20లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ప్రాజెక్టులోని 40గేట్లు ఎత్తి 5.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టుపై వాహన రాకపోకలు నిషేధించగా.. దిగువన ప్రాంతాల్లోని మేకల, గొర్రెల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఉప్పొంగిన నదులు

మంచిర్యాలటౌన్/కోటపల్లి/వేమనపల్లి: జిల్లాలోని గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంచిర్యాల కాలేజీరోడ్డులోని నది ఒడ్డున ఉన్న పుష్కర ఘాట్ మెట్లను తాకుతూ గోదావరి ప్రవహిస్తోంది. సమ్మక్క, సారలమ్మ గద్దెలు వరద నీటిలో మునిగిపోయాయి. కోటపల్లి మండలంలో ప్రాణహిత నది ఉప్పొంగడంతో అర్జునగుట్ట, రాపన్‌పల్లి, అన్నారం, లక్ష్మీపూర్, దేవులవాడ గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. వేమనపల్లి మండలంలో ప్రాణహిత నది నిండుకుండలా ప్రవహిస్తోంది. వేమనపల్లి పుష్కరఘాట్‌తోపాటు రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. ముల్కలపేట బొంద చేను ఒర్రె వరకు, సుంపుటం అట్టలొర్రె, మత్తడి వాగు వంతెనల వరకు వరద నీరు ప్రవహిస్తోంది. లోతట్టు గ్రామాలైన కల్లంపల్లి, ముక్కిడిగూడం, జాజులపేట, వేమనపల్లి, కేతన్‌పల్లి, రాచర్ల ముల్కలపేట శివారులోని పత్తి పంటలకు ముంపు భయం పట్టుకుంది. వరద తీవ్రతతో పుష్కరఘాట్, వెంచపల్లి వద్ద నాటుపడవల రాకపోకలు నిలిపివేశారు.

రహదారుల మరమ్మతులు చేపట్టాలి



మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో బాలింతలతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం: వరదల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని బూరుగుపల్లి దాంపూర్ వెళ్లే దారిలో గర్రెపల్లి సమీపంలో దెబ్బతిన్న రహదారి, మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పరిశీలించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సదర్శించి గదులు, రిజిష్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ అంజమ్మ, పాల్గొన్నారు.

గోదావరిలోకి ఎవరూ వెళ్లకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: గోదావరి నదికి వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో ఎవరూ నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని గోదావరి నదీ తీరం వద్ద వరద పరిస్థితిని అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో వరద బాధితుల సహాయార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసర సేవల కోసం 90 మంది సభ్యులతో కూడిన మూడు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, తహసీల్దార్ రఫతుల్లా, సీఐ ప్రమోద్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, ఐసీయూ, పిల్లల వార్డు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలు పరిశీలించారు. ఓపీ వార్డులో గర్భిణులు వేచి ఉండగా, త్వరగా వైద్య పరీక్షలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాలేజీ రోడ్డులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.

నగర కమిషనర్‌గా సంపత్‌కుమార్



కే.సంపత్‌కుమార్



కే.విజయ్‌కుమార్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ రెగ్యులర్ కమిషనర్‌గా కే.సంపత్‌కుమార్ నియామకం అయ్యారు. ఆయన స్థానంలో లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్‌గా కే.విజయ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కే.శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ కే.సంపత్‌కుమార్‌కు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయనను మంచిర్యాల రెగ్యులర్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఉన్న కే.విజయ్‌కుమార్‌ను లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ గ్రేడ్–3 కమిషనర్‌గా ఎం.జయ్‌కుమార్‌ను నియమించారు.

కొత్త గ్రూపులు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కసరత్తు
- సంఘాల్లో లేని మహిళలకు అవకాశం

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా జిల్లాలో కొత్తగా మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం సంఘాల ఏర్పాటులో నిమగ్నమైంది. 60ఏళ్లు దాటిన మహిళలు, 15ఏళ్లు నిండిన కిషోర బాలికలు, దివ్యాంగులతో సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఈ నెల 11నుంచి గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు, సభ్యులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే 135 పెద్దల సంఘాలు(ఓల్డ్ ఏజ్ గ్రూప్), దివ్యాంగులు 71, కిషోర బాలికలతో 76 సంఘాలు ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రూపులో 10నుంచి 15మంది సభ్యులు ఉండేలా చూస్తున్నారు. దివ్యాంగులు ఐదు నుంచి పది మంది ఉంటే సరిపోతుంది. వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటూ ఇప్పటివరకు స్వయం సహాయక మహిళా సంఘాల్లో లేని వారికి అవకాశం కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కిషోర బాలికల వివరాలు సేకరించి గ్రూపు ఏర్పాటు చేస్తున్నారు. కొత్త గ్రూపు ఏర్పాటు చేసుకున్న వారు గ్రూపు పేరిట బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. నిర్వహణకు ఇద్దరు సభ్యులను అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకుంటారు. ఆరు నెలల వరకు కొంత మొత్తం పొదుపు చేస్తే ఆ తర్వాత బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారు. ఈ నెల 30లోపు కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లాలో 10వేల మంది సభ్యులతో కొత్త గ్రూపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని కిషోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులు స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న రుణాలు, రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్ తెలిపారు.

పింఛన్లు పెంచుతారా.. సీఎం రాజీనామా చేస్తారా



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నా పింఛన్లు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, పింఛన్లు పెంచుతారా.. సీఎం పదవికి రాజీనామా చేస్తారా తేల్చుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. స్థానిక మార్వాడీ ధర్మశాలలో బుధవారం విశ్వరూప మహాగర్జన సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.200 ఉన్న పింఛన్లు రూ.వెయ్యికి పెంచడం తమ పోరాట ఫలితమేనని, మరోసారి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేయూతదారులకు రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, సారంగం, చకినారపు మల్లేశ్, రాసపాక మల్లేశ్, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

బీసీలను అణగదొక్కాలని చూడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

- త్వరలో బీసీల కోసం పార్టీ ఏర్పాటు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

పాతమంచిర్యాల: బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కాలని చూస్తే ఉగ్రరూపం చూస్తారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవన్‌లో 'బహుజనుల రాజ్యాధికార సాధనకు నేను సైతం' సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓట్లు మనమే వేసుకుని బహుజనులమంతా కలిసి రాజ్యాధికారం సాధించాలని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వెలమలు, రెడ్లను గెలువనీయబోమని అన్నారు. బీసీల కోసం ఒక పార్టీ ఉండాలని, త్వరలో పార్టీ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాజకీయ పార్టీలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుధగాని హరిశంకర్‌గౌడ్, కో ఆర్డినేటర్ జానయ్యయాదవ్, జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి



ఖర్జీభీంపూర్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

భీమిని: భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. భూభారతిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కారం అయ్యాయి అని తహసీల్దార్ బికార్ణదాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన గోకుల సునీత ఆర్వోఎఫ్ఆర్‌లో భూమి సాగు చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారని సీఎం పేషీలో ఫిర్యాదు చేసింది. దీంతో ఆ భూమి వద్దకు సబ్ కలెక్టర్ ట్రాక్టర్‌పై తహశీల్దార్‌తో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల తయారీలో నిమగ్నం



మట్టితో తయారు చేస్తున్న వినాయకుడు

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. పెట్రోల్‌పంప్‌ ఏరియా, మార్కెట్‌, నజ్రుల్‌నగర్‌, రాంనగర్‌, విలేజ్‌నెం 5, చింతగూడ గ్రామాల్లో వినాయకుల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి



చిన్ననాటి నుంచే విగ్రహాల తయారీపై ఆసక్తితో చిన్నచిన్న గణపతులను తయా రు చేసి ఇంట్లో పూ జించే వాళ్లం. 23 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నా. భక్తులను ఆకర్షించేలా వివిధ డిజైన్లలో, హనుమంతుడిపై వినాయకుడు, రామసే తు వినాయకుడులాంటి రూపాల్లో బంకమట్టి, సహజ సిద్ధమైన రంగులతో 5 నుంచి 20 ఫీట్ల వరకు విగ్రహాలు తయారు చే స్తున్నా. ఈ ఏడాది ఇందిరా మార్కెట్‌ భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నా.

– గౌత్రే విక్రమ్‌, కళాకారుడు, కాగజ్‌నగర్‌

పర్యావరణ పరిరక్షణకు..



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను తయారు చేస్తున్నా. వినాయకుడి విగ్రహాలతో పాటు దుర్గాదేవి విగ్రహాలను కూడా తయారు చేస్తా. పదోతరగతి తర్వాత మట్టి విగ్రహాలను ఇంట్లో తయారు చేసేవాడిని. ఇప్పుడు 12 ఫీట్ల వరకు వినాయ విగ్రహాలను తయారు చేస్తున్నా. పట్టణంలోని త్రినేత్ర శివాలయంలో వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠిస్తాం

– ములుకుట్ల జశ్వంత్‌, ఆదర్శనగర్‌, కళాకారుడు

పర్యావరణహితాయ..
పార్వతి తనయా

- మట్టి వినాయకులకు పెరుగుతున్న ప్రాధాన్యత
- విభిన్న ఆకృతుల్లో దర్శనమిస్తున్న లంబోదరుడు
- ఉపాధి పొందుతున్న పలువురు కళాకారులు

ఆదిలాబాద్‌: వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రం వ్యాప్తంగా మట్టి ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. ఎంతోమంది కళాకారులకు ఉపాధి అందిస్తున్నాయి. వైవిధ్యమైన రూపాల్లో పార్వతి తనయున్ని పర్యావరణహితంగా ప్రతిష్ఠించేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక ప్రతిమలను నిలబెట్టేందుకు యువత, ఉత్సవ సమితి సభ్యులు ప్రాధాన్యత నిస్తుండడం విశేషం. పీఓపీ విగ్రహాలు తక్కువ సమయంలో పూర్తవుతాయి. మట్టి ప్రతిమల తయారీకి 10 నుంచి 20 రోజులు పడుతుంది. అయినప్పటికీ నిర్వాహకులు వైవిధ్యమైన రూపాల్లో మట్టి వినాయకున్ని కొలువుదీర్చేందుకు ఆర్డర్లు ఇస్తుండడం గమనార్హం. దీంతో కళాకారులకు చేతినిండా పని దొరుకుతోంది. మరోవైపు పర్యావరణ పరిరక్షణ సైతం సాధ్యమవుతుండడంతో పర్యావరణ ప్రేమికుల నుంచి సైతం హర్షం వ్యక్తం అవుతుంది.



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

ఆదరణ పెరిగింది



గతంతో పోలిస్తే పీఓపీ విగ్రహాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వైవిధ్యమైన ప్రతిమలు తయారు చేయాలంటే మట్టితో మాత్రమే సాధ్యమవుతుంది. దీంతో మట్టి వినాయక విగ్రహాలకు ఆదరణ పెరిగింది. మట్టి ప్రతిమలు తయారు చేసేందుకు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. ముందుగానే ఆర్డర్‌ ఇస్తే మరిన్ని ప్రతిమలు తయారు చేసే అవకాశం ఉంటుంది.

– ఎగిడి రవి కుమార్‌, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్‌

నల్లమట్టి దొరకడం లేదు..



పది సంవత్సరాల వయస్సు నుంచే విగ్రహాల తయారీలో పాల్గొంటున్నా. నేను ఉద్యోగం చేస్తూనే.. మా కులవృత్తిని కాపాడుకునేందుకు విగ్రహ తయారీని కొనసాగిస్తున్నా. గతంలో స్థానికంగానే దొరికే నల్లమట్టితో విగ్రహాలను తీర్చిదిద్దే వాళ్లం. అయితే ఇప్పుడు నల్ల మట్టి కరువైపోయింది. స్థానికంగా దొరకడం లేదు. దీంతో మహారాష్ట్రలోని అమరావతి నుంచి మట్టిని కొనుగోలు చేస్తున్నాం.

– ప్రశాంత్‌ కుమార్‌, విగ్రహ కళాకారుడు

వారసత్వం కొనసాగిస్తున్నాం..



సంప్రదాయ బద్ధంగా తాతలు నేర్పిన కళను ముందుకు తీసుకెళ్తున్నాం. సాధారణ రోజుల్లో ఉద్యోగాలు చేసుకుంటూ, ప్రత్యేక పర్వదినాల సమయంలో విగ్రహాల తయారీ చేపడుతున్నాం. నిర్మల్‌ ప్రాంతంలో మావారు కొయ్య బొమ్మలు తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో మేము ఎక్కువగా వినాయకచవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాల సమయంలో, బోనాల సమయంలో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– చంద్రశేఖర్‌, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్‌

కళాకారులను ఆదుకోవాలి



సీజన్‌ సమయంలో మాత్రమే ఉపాధి దొరుకుతుంది. దీంతో మాలాంటి కళాకారులంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి కళాకారులపై దృష్టి సారించాలి. ప్రోత్సాహకాలను అందించడంతోపాటు, ఏదైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అండగా నిలబడాలి. ప్రస్తుతం నేను 54 అడుగుల విగ్రహాన్ని తయారు చేస్తున్నా. విగ్రహాల ఎత్తు పెరుగుతుంది తప్పితే మా జీవితాల్లో మాత్రం ఎదుగుదల కనిపించడం లేదు.

– ఊరే గణేశ్‌, విగ్రహ కళాకారుడు

నిర్మల్‌లో పదేళ్లుగా...



మట్టి వినాయకుడి తయారీలో కళాకారుడు గోపి

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ పట్టణం గతం నుంచీ మట్టి గణపతుల తయారీకి ప్రసిద్ధి గాంచింది. జిల్లా కేంద్రానికి చెందిన కోటగిరి గోపి పదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. అతని కుమార్తె మంజుశ్రీ తయారైన మట్టి విగ్రహాలకు డిజైనింగ్‌ చేస్తుంది. కుమారుడు గణిత్‌ వారికి సహాయపడుతుంటాడు. సుమారు 30 విగ్రహాలను తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తుంటారు. ఇవి మూడు ఫీట్ల నుంచి ఏడు ఫీట్ల వరకు ఉంటాయి. మట్టి గణపతుల తయారీలో చెరువుల నుంచి తెచ్చిన బంకమట్టి, ఎండిన వరిగడ్డి, తవుడు, ఊబక, కట్టెపొడి, వెదురు బొంగులు వాడుతున్నారు. ఇవన్నీ పర్యావరణహితమని చెబుతున్నారు. వీటిని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఇవన్నీ తేలికగా నీటిలో కరిగిపోతాయి. డిజైన్‌, సైజ్‌ ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు ఉన్నాయి.

వినాయకుడు అంటేనే ప్రకృతి..



హిందూ సంప్రదాయం ప్రకారం మట్టి గణపతినే పూజించాలి. గణపతి పూజ అంటే ప్రకృతికి పూజ అని అర్థం. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్‌ అఫ్‌ పారిస్‌ గణపతులతో వాతావరణం కలుషితం అవుతుంది. కాబట్టి మన ధర్మాన్ని మనం పాటించాలి.

– కోటగిరి గోపి, విగ్రహ కళాకారుడు, నిర్మల్‌

మట్టి మేలు తలపెట్టి..!

మంచిర్యాలఅర్బన్‌: సంప్రదాయంగా వస్తున్న పండుగలను ప్రస్తుతం జరుపుకునే విధానంలో చేస్తున్న పొరపాట్లు పర్యావరణానికి ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి. వినాయక చవితి రోజు చేస్తున్న పొరపాట్లు చీకట్లు మిగుల్చుతున్నాయి. కానీ.. వినాయక చవితి అనగానే ఆకర్షణ, హంగు, ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొన్నేళ్లుగా రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాలతో భక్తులను ఆకట్టుకునే విధంగా మట్టి గణపయ్యలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కులవృత్తులు కాపాడుతూ.. ఉపాధినిస్తూ

కనుమరుగవుతున్న కులవృత్తిని కాపాడాలనే సదుద్దేశంతో మట్టి వినాయకుల తయారీతో పాటు ఎంతోమందికి ఉపాధినిస్తున్నారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన నాగపూరి రాజేంద్రప్రసాద్‌ మంచిర్యాలలోని సున్నంబట్టీవాడలో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసిన ఆయన కులవృత్తితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఆలోచన చేశారు. 2015లో ఏడు మట్టి విగ్రహాలు



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు

తయారీ చేసి విక్రయించారు. 2018లో 52 మట్టి ప్రతిమలను రూపొందించి పర్యావరణ హితానికి నడుం బిగించారు. ప్రస్తుతం శ్రీగణేష్‌ క్లే వర్క్‌ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. దాదాపు 80 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు. ముస్ముందు దీపావళికి ఉపయోగించే ప్రతిమలు, ఇంట్లో వినియోగించే మట్టిపాత్రలు, కుండలు ఇలా అన్ని రకాలు తయారీ చేయాలని నిర్ణయించారు.

మట్టివిగ్రహాలతో ఆదాయం భళా..

పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీ సరఫరా టెండర్‌ దక్కించుకున్నారు. 40వేల వినాయకులు సరఫరా చేయనున్నారు. మరోవైపు రెండో అన్నవరంగా పేరొందిన గూడెం సత్యనారాయణ టెంపుల్‌లో ఏర్పాటు చేసే మట్టి వినాయకుడు ఇక్కడే తయారు చేశారు. ఆదిలాబాద్‌ బీసీ వెల్ఫేర్‌ డిపార్ట్‌మెంట్‌ 2వేల మట్టి వినాయకుడు ఆర్డర్‌ ఇచ్చింది. ఎనిమిది నుంచి తొమ్మిది అడుగుల ఎత్తులో మట్టి వినాయకులు తయారు చేశారు. వినాయకుల తయారీలో కర్ర, మట్టి, గడ్డితో తడి సున్నం, వాటర్‌ కలర్‌లు విని యోగించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

తాతల కాలం నుంచి..

తాతల నుంచి వచ్చిన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని మట్టి వినాయకులు తయారీ చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు మంచిర్యాలకు చెందిన తాళ్లపల్లి తిరుపతి. ఇంటర్‌ పూర్తి చేసినా కులవృత్తి మట్టికుండల తయారీలో తర్ఫీదు పొందాడు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికుల సహకారంతో ఏటా 2వేల విగ్రహాలకు పైగా మట్టి విగ్రహాలు తయారు చేసి ఆర్డర్‌పై ఇస్తుంటాడు. మూడు కుటుంబాలు(తన కుటుంబ సభ్యులు) మట్టి వినాయకుల తయారీలో పాలు పంచుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. చిన్న విగ్రహాలను చూడముచ్చటగా తీర్చిదిద్ది మార్కెట్లో విక్రయిస్తుంటారు. మట్టికి సులువుగా కరిగే గుణం ఉంటుందని, విగ్రహాల తయారీలో చెరువు మట్టి వినియోగంతో పూడిక సమస్య తొలగిపోతుందని, అందు కే మట్టికి ప్రాధాన్యం ఇస్తున్నామని తిరుపతి తెలిపారు. వినాయక చవితి పర్యావరణానికి పూర్తిగా మేలు చేసే పండుగని, మట్టితో పూజించాలని ఆయన సూచించారు.

పదిహేనేళ్లుగా తయారీ



చెన్నూర్‌: పర్యావరణ పరిరక్షణేలక్ష్యంగా పది హేనేళ్లుగా మట్టి విగ్రహాలు త యారు చేస్తున్నా. ప్రతియేటా వంద మట్టి విగ్రహాలు త యారు చేస్తుంటా. మట్టిని తీసుకొచ్చి స్వయంగా నెల రోజుల వరకు విగ్రహాలను తయారు చేస్తా. మట్టి ఖర్చులు తీసుకొని విగ్రహాలు ఇస్తాను. కొన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నా. ఇప్పటి వరకు మూడు ఫీట్ల ఎత్తు విగ్రహాలు చేస్తున్నా. రానున్న రోజుల్లో పది ఫీట్ల ఎత్తు విగ్రహాలు తయారు చేస్తాను.

ప్ర భుత్వం పర్యావరణంతోపాటు కులవృత్తులను ప్రో త్సహించటానికి ప్రభుత్వ స్థలం లీజుకు ఇస్తే మరింత మందికి ఉపాధినిస్తానని రాజేంద్రప్రసాద్‌ తెలిపారు.

తాత్విక'ముని'కి కీర్తి పురస్కారం

నిర్మల్‌ఖిల్లా: ప్రముఖ తాత్విక కవి, రచయిత మునిమడుగుల రాజారావుకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది. ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలను అందిస్తోంది. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం పురస్కార వివరాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలం తంగళ్ళపల్లికి చెందిన రాజారావు యుక్తవయసునుంచే సాహిత్య పఠనం తాత్విక రచనల ద్వారా విశేషంగా పేరు గడించారు. ప్రస్తుతం నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని ఎల్‌



రాజారావు

ఐసీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. అనాగరిక గేయం, నేను ఎవరు..?, దుఃఖ నది, హూ ఎమ్‌ ఐ, సత్యం వైపు పయనం వంటి అనేక రచనలతో సాహితీ రంగంలో తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. పలు రచనలు ఆంగ్లంలోనికి అనువాదమయ్యాయి. గతంలోనూ తన రచనల ద్వారా అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందుకోనున్నారు.

భుజంపై వాగు దాటించి..



కెరమెరి మండలంలోని బోరిలాల్‌గూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్‌ పవార్‌ కవిత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్దామంటే ఇటీవల కురుస్తున్న వర్షాలకు మధ్యలో ఉన్న అనార్‌పల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఇంటివద్దే ఉంటోంది. బుధవారం జ్వర తీవ్రత పెరగడంతో సొమ్మసిల్లి పడిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఆమెను భుజంపై ఎక్కించుకుని అతికష్టం మీద వాగు దాటించారు. కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – కెరమెరి

'కాంగ్రెస్‌, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలు'

ఇచ్చోడ: కాంగ్రెస్‌, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలని బీఎస్పీ సెంట్రల్‌ స్టేట్‌ కోఆర్డినేటర్‌ నిషాని రాంచంద్రం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని మంచిర్యాల, ఆసిఫాబాద్‌, ఆదిలాబాద్‌, నిర్మల్‌ జిల్లాల కమిటీల పనితీరు, పార్టీ బలోపేతం విధివిధానాలను సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 1950 నుంచి 93 వరకు బీసీలకు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో



మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల సతీశ్‌కుమార్‌, రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌, స్టేట్‌ ఈసీ మెంబర్‌ మెస్రం జంగుబాబు, నిర్మల్‌, ఆదిలాబాద్‌, ఆసిఫాబాద్‌, మంచిర్యాల జిల్లాల అధ్యక్షులు జగన్‌, ముల్కల రాజేంద్రప్రసాద్‌, రత్నపురం రమేశ్‌, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌ దాడులు

పెంబి: మండలంలోని ఇటిక్యాల్‌, ఇటిక్యాల్‌ తాండ, పెంబి తాండ, తాటిగూడ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్‌ అధికారులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఇన్‌స్పెక్టర్‌ గంగారెడ్డి, ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ అభిషేకర్‌ తెలిపారు. వారి వద్ద నుండి 20 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌ సిబ్బంది వెంకటేష్‌, సాయి, రాజేందర్‌, రవీందర్‌, నిరోషా, రవి, అశ్వక్‌, జమీర్‌, విజయ పాల్గొన్నారు.



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్‌ అధికారులు

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్‌ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గాదె రాజేశ్‌ (28) బుధవారం మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్‌

బెల్లంపల్లిరూరల్‌: బెల్లంపల్లి టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నలుగురు పాత నేరస్తులను బుధవారం తహసీల్దార్‌ కృష్ణ ఎదుట బైండోవర్‌ చేసినట్లు టూటౌన్‌ ఎస్సై సీహెచ్‌ కిరణ్‌ కుమార్‌ తెలిపారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వారిని బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్‌ సీఐ కె.నాగరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఎనిమిది గంట ల ప్రాంతంలో రైల్వే స్టేషన్‌ ఎదుట ఆదిలా బాద్‌ పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన షేక్‌ మసూద్‌, మహారాష్ట్రలోని బోకర్‌ తాలు కా చిక్కల్‌వాడికి చెందిన జుబేర్‌ ఫారుక్‌ పఠా న్‌ గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న టూటౌన్‌ ఎస్సై విష్ణు ప్రకాష్‌, సిబ్బంది సుధాకర్‌ రెడ్డి, వినాయక్‌, గోపాల్‌, నరేందర్‌, సంజీవ్‌, క్రాంతి అనుమానం వచ్చి వారిని విచారించారు. వారి వద్ద 243 గ్రాము ల ఎండు గంజాయి లభ్యం కావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీకి యత్నించిన ఇద్దరి రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని టూటౌన్‌ పరిధిలో గల శ్రీనివాస వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్‌ సీఐ కె.నాగరాజు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు వైన్స్‌ వెనుక గల గోడకు కన్నం వేసి లోనికి ప్రవేశించేందుకు యత్నించారు. అదే సమయంలో అటుగా వచ్చిన పోలీస్‌ పెట్రోలింగ్‌ వాహనాన్ని చూసి పరారయ్యారు. పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన షేక్‌ బిలాల్‌, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్‌ షారుక్‌ ఖాన్‌లను పంజాబ్‌ చౌక్‌లో మంగళవారం పట్టుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వైన్స్‌ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.